క్లుప్తంగా

నేడు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీఓ సోనీబాయి, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ రావు గురువారం తెలిపారు. మడకశిర అర్బన్, మడకశిర రూరల్ మండలాల డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి మెగా చెక్ అందిస్తారన్నారు. మడకశిర మున్సిపాలిటీ, మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

పానక బండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



పానకం బండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గోరంట్ల : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గోరంట్ల నుంచి మరువ ఆంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో తీసుకెళ్లే పానకం బండ్లను ఎమ్మెల్యే శంకరనారాయణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

సోమందేపల్లి: కొనతట్టుపల్లి రామాలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ గురువారం జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సుదర్శన్ శర్మ, ఎల్లారెడ్డి, ఆలయ ధర్మకర్త శివరామిరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



కోట్లో రంగారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తదితరులు

గోరంట్ల: అనారోగ్యంతో బాధపడుతున్న మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు డీలర్ కోట్లో రంగారెడ్డి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ నివాసానికి గురువారం వెళ్లి పరామర్శించారు. రంగారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

'కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం'

పావగడ: వచ్చే విధాన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజారిటీతో అధికారం చేపట్టడం ఖాయమని, గ్యారంటీ కార్డుల్లో పేర్కొన్న పథకాలు అమలు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు. తాలూకాలోని రంగసముద్రం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు వెంకటేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జేడీఎస్ అధికారంలోకి వస్తే పంచ రత్నాలు'

పావగడ: జేడీఎస్ పార్టీ అధికారంలోకి వస్తే పంచరత్న ప్రణాళిక అమలు చేస్తామని స్థానిక మాజీ ఎమ్మెల్యే, జేడీఎస్ అభ్యర్థి కేఎం తిమ్మరాయప్ప అన్నారు. పట్టణంలోని ఆదర్శ నగర్‌లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల పక్షపాతి కుమారస్వామి నేతృత్వంలో వచ్చే విధాన సభ ఎన్నికల్లో అధిక మెజారిటీ సాధించి ఎవరి పొత్తు లేకుండా అధికార పగ్గాలు చేపడతాన్నారు. ఈ సందర్భంగా ఆదర్శనగర్‌లోని 10,11 వార్డుల కు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ నాయకులు జేడీఎస్ పార్టీలోకి చేరారు. అదే విధంగా కొరచ సామాజిక వర్గానికి చెందిన 120 కుటుంబాలు జేడీఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో పలువురు జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడకశిర(అగళి): అగళి మండలంలోని రామనపల్లి సమీపాన గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసన్న, మంజునాథ్ గాయపడ్డారు. మడకశిర మండలం గుండుమలకు చెందిన దాసన్న ద్విచక్ర వాహనంలో స్వగ్రామం నుంచి రొళ్ల మీదుగా అగళి మండలం వైపు బయలుదేరాడు. రామనపల్లికి మంజునాథ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో జాతీయ రహదారిలో అగళి వైపు వెళ్తూ అకస్మాత్తుగా కుడి వైపు తిరిగి అడ్డు రావడతో వెనకాల వేగంగా వస్తున్న దాసన్న వాహనం ఢీకొంది. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108లో క్షతగాత్రులను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం





హిందూపురం: సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, పేట వేంకటరమణస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం



పెనుకొండ రూరల్: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సబ్‌కలెక్టర్ కార్తీక్

హిందూపురం: శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. గురువారం సూగూరు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి ఉదయం పంచామృతాభిషేకాలు చేసి బంగారు కవచధారణ, పుష్పాలతోనూ, మామిడి ఆకుల తోరణాలతో అలంకరించారు. ఈసందర్భంగా ఆకుపూజ, కుంకుమ సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై సీతారాముల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పుష్పాలు, తోరణాలతో అలంకరించి వందలాది భక్తుల నడుమ వేదపండితులు శాస్త్రోక్తంగా సీతారామ కల్యాణం జరిపించారు. తర్వాత సీతారాముల ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి మేళతాళాలతో ఆలయం నుంచి బెంగళూరురోడ్డు ఆర్చి వరకు రథాన్ని లాగి తిరిగి ఆలయం వద్ద కొలువుదీర్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహమూర్తి, టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో పూజలు

పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని పేట వేంకటరమణ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపారు. భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మోడల్‌కాలనీలోని వ్యాసరామ అభయాంజనేయ స్వామి ఆలయం, డీఆర్‌కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కలాణం జరిపించారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

లేపాక్షి: మల్లిరెడ్డిపల్లి, చోళసముద్రం, కంచిసముద్రం, మానేపల్లి, శిరివరం, లేపాక్షి తదితర ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదానం, తీర్థప్రసాదాలు, పానకం, పెసల బ్యాళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. మానేపల్లి ఎస్సీ కాలనీ, కల్లూరు, లేపాక్షిలో వెలిసిన శ్రీరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎం.వెంకటాపురంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు పారితోషికంతో పాటు బహుమతులను ప్రదానం చేశారు.

వైభవంగా సీతారాముల బ్రహ్మరథోత్సవం

లేపాక్షి: పులమతి ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన సీతారాముల బ్రహ్మ రథోత్సవం గురువారం అత్యంత వైభవంగా సాగింది. ఏటా శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని సీతారాముల బ్రహ్మరథోత్సం జరపడం ఆనవాయితీ. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల సమేత లక్ష్మణ విగ్రహాలను రథోత్సవంలో ప్రతిష్ఠంపజేశారు. అక్కడ హోమాలు, ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. మారెమ్మ ఆలయం నుంచి బస్టాండు వరకు రథోత్సవం సాగింది. భక్తులకు పానకం, పెసర బ్యాళ్లు, మజ్జిగ, అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు. సర్పంచ్ అశ్వత్థనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు నాగజ్యోతి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి

పెనుకొండ: పట్టణంలోని రామభద్రాలయంలో గురువారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవం జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని పెద్ద చెరువుకట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సబ్ కలెక్టర్ కార్తీక్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉట్ల పరుష నిర్వహించారు.

చిలమత్తూరు: మండలంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కోడూరు మద్రోతోపులోని రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం రాములోరి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు. చేనేపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించారు..

వడపప్పు, పానకాల పంపిణీ

హిందూపురం: ధన్‌రోడ్డులోని బైలాంజినేయస్వామి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, దీపికారెడ్డి భక్తులకు వడపప్పు, పానకాలు పంపిణీ చేశారు. చౌళూరులోని ఆంజనేయ స్వామి ఆలయం, గ్రామదేవత మారెమ్మగుడి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి హాజరై పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద హిందూపురం ట్రాన్స్‌కో అధికారులు, కోట ఏరియా విశ్వవినాయక సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీరాముడి చిత్రపటాన్ని కొలువుదీర్చి హిందూ, ముస్లింలతో కలిసి వడపప్పు, పానకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, జెపికె రాము, సూర్యవంశి ఆర్యకటిక సంఘం నాయకులు నర్సోజిరావు, లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

సోమందేపల్లి/రొద్దం/ పరిగి : మండలంలోని చిన్న బాబయ్యపల్లి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అన్నదానంతోపాటు పానకం భక్తులకు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, గ్రామ పెద్దలు చంద్రశేఖర్ రెడ్డి, అంజినరెడ్డి, కేశవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రొద్దం పెద్దాంజనేయ స్వామి, బైలాంజనేయస్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేకంగా పూజలు చేశారు. బైలాంజనేయస్వామి ఆలయం వద్ద సాయంత్రం ఉట్ల జాతర జరిగింది. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీ పడగా గాలిమిషన్ వెంకటరాముడు అనే యువకుడు ఎక్కాడు. గౌరాజుపల్లిలో సీతారాముల కల్యాణోత్సం నిర్వహించారు. పరిగి మండలంలో శ్రీరామనవమి సందర్భంగా ఉదయం నుంచే శ్రీరాముడి ఆలయాలతో పాటు ఆంజనేయ స్వామి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సీతారామ కల్యాణోత్సవంతోపాటు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, రథోత్సవాలు నిర్వహించారు. పరిగిలో వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. దైవదర్శనం, కల్యాణోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు పోటెత్తారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

గోరంట్ల: మండలంలోని కరావులపల్లి తండా సమీపంలో వెలసిన అభయాంజనేయస్వామి సన్నిధిలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. కరావులపల్లి తండాకు చెందిన హైదరాబాద్‌లో స్థిరపడిన పారిశ్రామిక వేత్త శంకర్‌లాల్ నాయక్ రూ.60 లక్షలతో నిర్మించిన ఆలయంలో శివుడి విగ్రహ ప్రతిష్ఠ మంత్రోచ్చారణల నడుమ జరిగింది. ఆలయ కమిటీ , ధర్మకర్త పారిశ్రామికవేత్త శంకర్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం జరిపించారు. వేడుకల్లో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మెంబర్ ఆర్‌జే రత్నాకర్ హాజరై పూజలు చేశారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు బాబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ జయరాంనాయక్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా తండా మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతుల ప్రదర్శన చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

మడకశిర/రూరల్: మడకశిర పట్టణంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కన్య కాపరమేశ్వరి ఆలయంలో వేడుకలు చేపట్టారు. సీతా లక్ష్మణ హనుమ సమేత కోదండరామస్వామికి మహిళలు ముత్యాలు,పగడాలతో ప్రత్యేక సామూహిక పూజలు జరిపారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. మడకశిర కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు చేపట్టారు. అలాగే నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో నిత్య హోమం, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, ఉయ్యాల సేవ నిర్వహించారు. శ్రీరాముని పాదుకలను రఘువీరారెడ్డి నెత్తిన పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవ మూర్తిని గ్రామంలో ఊరేగించారు.

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన శ్రీరామ ఆలయం, రత్నగిరి గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా భక్తి భావంతో నిర్వహించారు. రత్నగిరిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవం కార్యక్రమాన్ని వేదపండితులు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో వేడుకలు చేపట్టారు,

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా బియ్యంతో అలంకరించి పూజలు చేశారు. అమరాపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. దక్షిణ గొల్లహట్టిలో సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న ఆధ్వర్యంలో శ్రీరాముని చిత్ర పటానికి పూలమాలలు వేసి వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఆలయాల వద్దచ పానకం, పెసర బేడలు పంపిణీ చేశారు.

అగళి: మండలంలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల వద్ద శ్రీరామ చిత్ర పటాలను ఉంచి పూజలు జరిపారు

గుడిబండ: మండల వ్యాప్తంగా ప్రజలు శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుడ్డదహళ్లిలో ఆంజనేయస్వామికి కూగీరనపాళ్యం గ్రామస్తులు జ్యోతులు సమర్పించారు.

పావగడ: పట్టణంలో కోట ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రమేశ్ స్వామి సీతా రాములకు పూజలు చేపట్టారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే, జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పఆలయాన్ని సందర్శించి నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయం వెలుపల ఆలయ అభివృద్ధి సంఘం పదాధికారులు పానకం, పెసరబేడల ప్రసాదాన్ని భక్తులకు అందించారు.



లేపాక్షి: సీతారాముల రథాన్ని లాగుతున్న భక్తులు



హిందూపురం: భక్తులకు వడపప్పు, పానకాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, దీపికారెడ్డి



చౌళూరులోని మారెమ్మ గుడివద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మధుమతిరెడ్డి



రొద్దం: ఉట్లమాను ఎక్కడానికి పోటీ పడుతున్న యువకులు



గోరంట్ల: శివుడి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మెంబర్ రత్నాకర్



మడకశిర రూరల్: నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉయ్యాల సేవ నిర్వహించిన దృశ్యం



మడకశిర రూరల్: రాముని పాదుకలను మోస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి



అమరాపురం:గౌడనకుంటలో పానకం పంపిణీ చేస్తున్న దృశ్యం



పెనుకొండ: రామభద్రాలయంలో కల్యాణోత్సవం జరిపిస్తున్న పురోహితులు

ఘనంగా ఉట్ల పరుష



పెనుకొండలో మిట్టాంజనేయస్వామి ఆలయం వద్ద ఉట్ల పరుష



అలంకరణలో ఊరువాకిలి ఆంజనేయస్వామి

పెనుకొండ: పట్టణంలోని మిట్టాంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఉట్ల పరుష ఘనంగా జరిగింది. సీతారామాంజనేయ విగ్రహాలకు మారుతీనగర్, బీటీఆర్ కాలనీ, శ్రీరాములయ్య కాలనీ, బోయగేరి తదితర ప్రాంతాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం జరిగిన ఉట్ల పరుష ఉత్సాహంగా జరిగింది. ఊరువాకిలి ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. రామభద్రాలయంలో పట్టణ ప్రజలు పూజలు చేశారు.

శ్రీరాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



లంకా దహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: పురుషోత్తముడైన శ్రీరాముని జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా సూగూరు ఆలయం వద్ద నిర్వహించిన ఉట్ల పరుషలో గెలుపొందిన యువకులకు నగదు బహుమతిని అందజేశారు. నవమి ఉత్సవాల్లో భాగంగా సూగూరు ఆలయ ఆవరణలో రాత్రి లంకాదహనం కనుల పండవగా జరిగింది. కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ప్రారంభించారు. ఈసందర్భంగా పదితలల రావణుడి విగ్రహం, రంగురంగుల బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు లోకేష్ , కౌన్సిలర్లు నాగేంద్రబాబు, ఆయుబ్, జె.మల్లికార్జున, ఆలయ ఈఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని కొనతట్టుపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ (39) అనే వ్యక్తి గురువారం రాత్రి ఇంట్లోని పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పద్మక్కతో సాయంత్రం గొడవ పడ్డాడు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై రాత్రి ఉరివేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సామూహిక వివాహాలు

మడకశిర: మండలంలోని నీలకంఠాపురం దేవస్థానాల ఆవరణంలో శుక్రవారం ఉదయం సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.15 నుంచి 7.45 గంటల వరకు జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవంతో పాటు సామూహిక వివాహాలు నిర్వహించననున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా పట్టనాయకనహళ్లి మఠాధిపతి నంజావధూతస్వామి హాజరవుతారన్నారు. అలాగే ఉదయం 9.30 గంటలకు ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నీలకంఠాపురం దేవస్థానాలకు చెందిన భక్తిగీతాల ఆవిష్కరణ, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

రొద్దం: నారనాగేపల్లి వద్ద పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం ఉదయం భూమిపూజ చేయనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.20 కోట్లతో పనులు ప్రారంభిస్తామన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఇఫ్తార్ విందు

హిందూపురం: రంజాన్ ఉపవాసదీక్షలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక అల్‌హిలాల్ మైదానంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీసులో ముస్లిం మతపెద్దలతో చర్చించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కలీంసాబ్, చందు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో ఆసరా సమావేశం: బెంగళూరు రోడ్డులోని ఆర్‌కె ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు ఆసరా లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల ఎంపీడీఓ నరేంద్ర తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, డ్వాక్రాసంఘాల సభ్యులు, యానిమేటర్లు, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మడకశిర రూరల్: పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిరుధాన్యాల ఉపయోగాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాల్యవివాహాల ద్వారా కలిగే అనర్థాలను ఆమె వివరించారు. డాక్టర్ వినోద్‌కుమార్, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక పోరాట ప్రదర్శన విజయవంతం చేయండి

హిందూపురం టౌన్/సోమందేపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో తలపెట్టిన కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను విజయవంతం చేయాలని రైతు సంఘం, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు చేపట్టిన జీపు జాతా గురువారం హిందూపురం పట్టణానికి చేరుకుంది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్లో నాయకులు మాట్లాడారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను మరింత జటిలం చేస్తూ, అత్యంత ధనవంతులైన ఆదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతోందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గంగాధర్, సీఐటీయూ నాయకులు రామకృష్ణ, అత్తరు బాబా, చంద్ర, మల్లికార్జున, రఫీక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే సోమందేపల్లిలో నిర్వహించిన జీపుజాతాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా రూ.9150 నగదు స్వాధీనం చేసుకోవడంతో ఐదు బైక్‌లు సీజ్ చేశామన్నారు.

కాపుచెన్నంపల్లి గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.55,550 నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

పావగడ: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. స్థానిక బీఈఓ అశ్వర్థనారాయణ విలేకరులతో మాట్లాడుతూ..పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తాలూకా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2,888 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షల కేంద్రాల్లో 16 మంది తనిఖీ అధికారులు, ఐదుగురు పైలెట్ అధికారులను నియమించామన్నారు.